క్లుప్తంగా



ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ కుమార్తె ప్రణవ వివాహం విజయవాడలో జరిగింది. మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్

పంటల పరిశీలన

చల్లపల్లి: విపత్తు వేళ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు అండగా ఉంటారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు అన్నారు. బుధవారం చల్లపల్లి మండలం మంగళాపురం, పాత మాజేరు గ్రామాల్లో నీట మునిగిన వరిపంటను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతాయని భరోసా కల్పించారు. అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ నాగిరెడ్డిపై దాడి

చల్లపల్లి: అభివృద్ధి పనులను అడ్డుకోవటమే కాకుండా దాడులకు పాల్పడటం సరికాదని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని) అన్నారు. బుధవారం మండల పరిధిలోని మంగళాపురంలో పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావుపై కొందరు దాడి చేశారు. ఈ దాడిలో పేరం నాగిరెడ్డికి గాయాలు కాగా పోలీసులకు ఫిర్యాదు చేసి, చల్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మండల అధ్యక్షుడు శీరం నాని, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, పార్టీ నాయకులు పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

పంట కాలువలోకి దూసుకు పోయిన కంటైనర్ లారీ

కృత్తివెన్ను: రొయ్యల లోడుతో వెళుతున్న కంటైనర్ లారీ మండల పరిధిలోని మునిపెడ సమీపంలో బుధవారం ఉదయం పంట కాలువలోకి దూసుకుపోయింది. స్థానికుల సమాచారం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా సీసలి నుండి మచిలీపట్నం వెళుతున్న లారీ మునిపెడ పెట్రోల్ బంకు సమీపంలో 216 జాతీయ రహదారిపై నుండి పంట కాలువలోకి ఉదయం 6.30 గంటల సమయంలో అదుపు తప్పి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో లారీలో డ్రైవర్ మాత్రమే ఉండగా అతనికి ఎటువంటి గాయాలు కాలేదు. లారీని మధ్యాహ్న సమయంలో క్రేన్ సహాయంతో బయటకు తీశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పెడన: బలిపర్రు కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ మధుసూదనరావుకు అందిన సమాచారం మేరకు ఆర్ఐ మణికుమార్, డీటీ మురళీధర్, వీఆర్‌ఓ గణేష్‌లు బలిపర్రు కాలనీలో దాచి ఉంచిన 50 కిలోల బరువు గల 10 బస్తాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పెడన 20వ వార్డుకు చెందిన కూర్మా శివగిరి అనే అతను ఇల్లు అద్దెకు తీసుకుని బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు అధికారులు తెలిపారు.

వర్షానికి రెండు ఇళ్లు ధ్వంసం

కోడూరు: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలో రెండు ఇళ్లు ధ్వంసమయ్యాయి. లింగారెడ్డిపాలెం శివారు జరుగువానిపాలెం గ్రామానికి చెందిన అప్పికట్ల లంకేశ్వరరావుకు సంబంధించిన రెండు నిట్టాడి పూరిల్లు వర్షం ప్రభావంతో కుప్పకూలింది. వర్షం నీటికి ఇంటి గోడలు చెమ్మగిల్లి బుధవారం ఒకసారిగా నేలకొరిగింది. ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామానికి చెందిన కోట శ్రీనివాస్ పెరుమాళ్లుకు చెందిన పెంకుటిల్లులోని ఒక భాగం గోడలు ధ్వంసమయ్యాయి. వర్షానికి గోడలు నానడంతో కూలిపోయినట్లు బాధితులు తెలిపారు. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాలను పరిశీలించి, వివరాలు సేకరించారు.

రైతులకు అండగా ప్రభుత్వం



గుండుపాలెంలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: తుపాను కారణంగా పంటలు కోల్పోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. భోగిరెడ్డిపల్లి, చిన్నాపురం, పెదయాదర, చిన యాదర, ఎస్. గొల్లపాలెం, గుండుపాలెం, రుద్రవరం, సీతారామపురం, ఎస్ఎన్ గొల్లపాలెం, సుల్తానగరం, అరిశేపల్లి గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ముంపులోనే పంట పొలాలు

- వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం
- తూడు, గుర్రపు డెక్కతో డ్రెయిన్లు

బంటుమిల్లి: మిచాంగ్ తుపాను రైతులను ముంచింది. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పెడన, అవనిగడ్డ, మచిలీపట్నం నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల్లో వరి ఇతర వాణిజ్య పంటలు నీట మునిగాయి. మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు లోతట్టు పంట పొలాలు, కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాల్లో వర్షం నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. బంటుమిల్లి మండలం ఆముదాలపల్లి మైనర్ డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్కను స్థానిక రైతులు స్వచ్ఛందంగా తొలగించే పనులు చేపట్టారు. బంటుమిల్లి మండల పరిధిలో సార్వా పంట సుమారు ఆరు వేల ఎకరాలు తుపాను ప్రభావానికి గురైనట్లు ఏఓ శివ రామకృష్ణ తెలిపారు. కోతలు పూర్తి చేసుకుని రాశుల మీద ఉన్న ధాన్యాన్ని తరలించేందుక సంచులు ఇస్తున్నామని ఆయన చెప్పారు. మండలంలో విద్యుత్ శాఖకు రూ. 2 లక్షలు నష్టం వాటిల్లిందని విద్యుత్ ఏఈ రవిబాబు తెలిపారు. మల్లేశ్వరం, పెదతుమ్మిడి పంచాయతీల పరిధిలో చెట్లు, కొమ్మలు విరిగి పడి 10 స్తంభాలు, వైర్లు దెబ్బతినగా యుద్ధప్రాతిప్రదికన పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని చెప్పారు.

06పిడిఎన్62 : చెరువులా కనిపిసున్న నాగేశ్వరరావుపేట పంట పొలాలు

కృత్తివెన్ను మండలంలో 909 హెక్టార్లలో వరికి నష్టం

కృత్తివెన్ను: మిచాంగ్ తుపాను తీరప్రాంత మండలమైన కృత్తివెన్నులో రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. బుధవారం వాతావరణం ఒకింత ప్రశాంతంగా మారింది. వరి చేలు నీటిలో నానుతున్నాయి. వేరుశనగ పంట, మినుము పూర్తిగా నీట మునిగింది. మండల వ్యాప్తంగా 909 హెక్టార్లలో వరి, 157 హెక్టార్లలో వేరుశనగ, 36 హెక్టార్లలో మినుము దెబ్బతిన్నట్లు ప్రాథమిక పంట నష్టం అంచనాలు రూపొందించామని అధికారులు వివరించారు. కోతకోసిన చేలల్లో వరి పనలు నీటిలో మునిగిపోవడంతో రైతులు వాటిని ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. మరికొందరు రైతులు చేలల్లో నీరు బయటకు పోయేలా దారులు చేస్తున్నారు. ఇప్పటికే నూర్పిడి పూర్తి చేసిన ధాన్యాన్ని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది.



పర్రచివర ప్రాంతంలో పడిపోయిన పంటను నిలబెట్టి కట్టుకుంటున్న రైతులు



కృత్తివెన్ను మండలం యండపల్లి వద్ద నీటిలో ఉన్న వరి పనలను ఒడ్డుకు చేర్చుకుంటున్న రైతులు

8,200 ఎకరాల్లో వరి నీట మునక

నాగాయలంక: నాగాయలంక మండలంలో ప్రాథమిక అంచనాల మేరకు 8,200 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని మండల వ్యవసాయ అధికారి ఎ.సంజీవరావు బుధవారం తెలిపారు. అవనిగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు జయప్రద నేతృత్వంలో ఏఓ సంజీవరావు, ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎస్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు క్షేత్ర స్థాయిలో పర్యటించి నీట మునిగిన పంట నష్టం అంచనాలు వేశారు. ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా మొలకలు రాకుండా, కంకులు కుళ్లిపోకుండా జాగ్రత్త పడవచ్చునని వివరించారు. కాగా మండలంలో 16 చోట్ల ఏర్పాటు చేసిన తుపాను పునరావాస కేంద్రాలను బుధవారం మధ్యాహ్నం భోజన వసతి తర్వాత ఇళ్ళకు పంపించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చికెన్ కర్రీతో భోజనాలు పెట్టి సాదరంగా ఎవరి ఇళ్లకు వారిని తరలించారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

రాష్ట్ర మంత్రి కారుమూరి



అరిసేపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి

కోనేరుసెంటర్/గూడూరు/బంటుమిల్లి: తుపానుకు పంటలు కోల్పోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బందరు మండలం అరిశేపల్లి, గూడూరు మండలం తరకటూరు, బంటుమిల్లి మండలం అర్తమూరు గ్రామంలో ఆయన పర్యటించి ముంపుబారిన పంటపొలాలను, తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో స్వయంగా మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతులకంటే ముందే తుపాను ప్రభావంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారన్నారు. వర్షాలకు దెబ్బతిన్న ప్రతి పొలాన్ని అధికారులు ఎన్యూమరేషన్ చేస్తారని చెప్పారు. రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. తడిచిన, రంగు మారిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్య పడవద్దన్నారు. రబీలో సాగుకోసం సబ్సిడీపై మినుము విత్తనం పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీఓ, జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా ఇన్‌చార్జ్ మేనేజర్ రాజు, డీఎస్‌వో పార్వతి, బందరు తహసీల్దార్ ఎం. శ్రీవిద్య, గూడూరు ఎంపిపి సంగా మధుసూధనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, బంటుమిల్లి తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఏఓ శివరామకృష్ణ, ఎస్ఐ ఎ. పైడిబాబు, ఆర్ఐ శేఖర్ పాల్గొన్నారు.

9,700 ఎకరాల్లో వరి పంటకు నష్టం

కోడూరు: కోడూరు మండలంలో 9,700 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని, నివేదికను ప్రభుత్వానికి పంపనున్నామని ఏఓ శ్రీధర్, ఏఈఓ సురేష్‌లు తెలిపారు. సచివాలయాల అగ్రికల్చర్ అసిస్టెంట్లతో కలిసి క్షేత్రస్థాయిలో పంటను బుధవారం వారు పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 16,500 ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేశారని చెప్పారు. 500 ఎకరాల్లో మాత్రమే యంత్రాల సహాయంతో వరి కోతలు కోశారని, మిలిగిన పంట కోతకు సిద్ధంగా ఉందని చెప్పారు. తుపాను కారణంగా కోడూరు, లింగారెడ్డిపాలెం, విశ్వనాథపల్లి, సాలెంపాలెం, ఉల్లిపాలెం పంచాయతీల పరిధిలో పంట అధికంగా నేలవారి, వర్షం నీటిలో ఉన్నట్లు గుర్తించామని వివరించారు.

పంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

కోడూరు: కోడూరు మండలంలోని 13 పంచాయతీల పరిధిలో ఈ ఏడాది 16,500 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. 500 ఎకరాల్లో మాత్రమే రైతులు యంత్రాల సహాయంతో వరికోతలు కోసి ధాన్యాన్ని భద్రపర్చుకున్నారు. మిలిగిన 16 వేల ఎకరాల్లో ఈదురు గాలులు, వర్షానికి పంట నేలవారింది. లింగారెడ్డిపాలెం, మందపాకల, పోటుమీద, కోడూరు, దింటిమెరక, జరుగువానిపాలెం, నక్కవానిదారి, విశ్వనాథపల్లి, నరసింహాపురం గ్రామాల్లో వరి పంటకు తీవ్ర నష్టం జరిగింది. పొలాల్లో నీరు బయటకు వెళ్లకపోతే వరి గింజలకు మొలకలు వచ్చే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పడిపోయిన పంటను కాపాడుకొనేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. వరి పనులను కట్టలు కట్టి నీటిలో నానకుండా ఆఖరి ప్రయత్నం చేస్తున్నారు. వరికోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ కనిపించారు.

నీట మునిగిన చేనేత మగ్గాలు

గూడూరు: భారీ వర్షాలకు ముంపు బారిన పడిన చేనేత మగ్గాలను చేనేత శాఖ సహాయ సంచాలకుడు కె.అప్పారావు పరిశీలించారు. మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు బుధవారం కప్పలదొడ్డి వచ్చిన అప్పారావు చేనేత గుంట మగ్గాలను పరిశీలించారు. తమను ఆదుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేయగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఏడీ హామీ ఇచ్చారు. నాయకులు పాల్గొన్నారు.

తుపాను బాధితులను ఆదుకుంటాం

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మోపిదేవి: మిచాంగ్ తుపానుకు నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని మూడు పునరావాస కేంద్రాలను ఆయన సందర్శించి బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాను ప్రభావంతో పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు ముఖ్యమంత్రి జగనన్న కొంతకాలం గ్రాసం ఏర్పాటు చేసుకునేందుకుగాను ఆర్థిక సాయం అందించారన్నారు. మండల పరిధిలో మొత్తం మూడు పునరావాస కేంద్రాల్లో మొత్తం 109 మందికి గాను రూ. 90,500 ఆర్థిక సాయం అందించామని తెలిపారు. ఒంటరిగా ఉన్నవారికి రూ. వెయ్యి, ఇద్దరికి రూ. 2 వేలు, 3 కంటే ఎక్కువ మంది ఉంటే వారికి రూ. 2,500 చొప్పున ఆర్థిక సాయం అందించామని వివరించారు.

- కోడూరు: మండలంలోని తీరప్రాంత గ్రామాలైన పాలకాయతిప్ప, బసవానిపాలెం, ఊటగుండం, రామకృష్ణాపురం గ్రామాలకు చెందిన 523 మందికి కోడూరు జెడ్పీ పాఠశాలలో పునరావాసం కల్పించారు. బాధిత కుటుంబాలకు మొత్తం రూ.4.78 లక్షల నగదును అందించినట్లు మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ యువ నేత సింహాద్రి వికాస్, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నష్టాలపై సమగ్ర నివేదికలు ఇవ్వండి

ప్రత్యేకాధికారి లక్ష్మీశా, కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు సంభవించిన నష్టాలపై పూర్తి వివరాలతో తక్షణం నివేదికలు అందజేయాలని ప్రత్యేకాధికారి లక్ష్మీశా, కలెక్టర్ పి రాజాబాబు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్ నుంచి బుధవారం వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం, దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, ఉద్యాన, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, మత్స్యశాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ దివిసీమలోని నాగాయలంక మండలంలో 29 సబ్‌స్టేషన్లలో 30 ఫీడర్లు దెబ్బతిన్నాయని, 111 విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, కూలిపోవటం జరిగిందన్నారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర సమాచారంతో కూడిన నివేదికలు అందించాలన్నారు.

పైప్‌లైన్ మరమ్మతు పనులు

మచిలీపట్నంటౌన్: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహించాయి. నగరంలోని చల్లపల్లి రోడ్డులో ఇటుక బట్టీల వద్ద ఉన్న డ్రెయిన్ ఉధృతంగా ప్రవహించడంతో శారదానగర్‌కు వెళ్లే ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌కు లీకు ఏర్పడింది. ఈ లీకుకు మునిసిపల్ తాగునీటి విభాగం సిబ్బంది బుధవారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులను మునిసిపల్ డీఈ సతీష్ చంద్ర పర్యవేక్షించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి
- విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళి



బందరులో నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ తదితరులు



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

పెడన: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పెడన పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు అన్నారు. పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్, వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం పట్టణ అధ్యక్షుడు బి. మహేష్, కోడూరు శీను, గుల్లంకి మాధవరావు పాల్గొన్నారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో గుణ్ణలపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, ఎస్సీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అంబేడ్కర్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- కృత్తివెన్ను: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ మైల రత్నకుమారి, ఎంపీడీఓ పిచ్చిబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- పెదపాలెం(నాగాయలంక): అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం ఏటిమొగ మెయిన్ రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మేడికొండ విజయ్, సంఘం సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగాయలంక ఉప్పులూరి రాధాకృష్ణమూర్తి పార్కు సెంటర్‌లో ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణపేశ్వరం ప్రధాన కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి గ్రామ కమిటీ నాయకులు, పెద్దలు నివాళులర్పించారు.
- మోపిదేవి: మోపిదేవి దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు జనార్ధనరావు, నందిగం అభిషేకరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- కోనేరుసెంటర్: స్థానిక పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీస్ జోనల్ ఇన్‌చార్జి సిలార్‌దాదా, మచిలీపట్నం మార్కెట్‌యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్, వైస్ చైర్మన్ సారథి, జక్కుల ఆనంద్‌బాబు, బేతపూడి రవి, చిటికిన నాగేశ్వరరావు, మేకల సుబ్బన్న, వాలిశెట్టి రవిశంకర్, నాయకులు పాల్గొన్నారు.

దళిత జేఏసీ ఆధ్వర్యంలో...

దళిత జేఏసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్ నోబుల్, దార్ల చెన్నకేశవరావు, చైతన్య, ప్రత్తిపాటి ప్రేమ్‌కుమార్, దమ్ము కేశవ, కాంగ్రెస్ నాయకుడు కొడమంచిలి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. దేశాయిపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ 34వ డివిజన్ ఇన్‌చార్జ్ బడే భానుతేజ, ప్రేమ్‌కుమార్, కేశవరావు, చెన్నకేశవ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు కొల్లూరి బసవమాదిగ, బీడెల్లి మరియకుమార్ మాదిగ, జూనపూడి గణేష్ మాదిగ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి డిపో మేనేజర్ టి పెద్దిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు.

- గూడూరు: ముక్కొల్లులో సర్పంచి సమ్మెట జయవర్ధన్, ఎంపీటీసీ వై.శ్రీనివాసరావులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.
- కోడూరు: స్థానిక తొమ్మిదవ వార్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ యువనేత సింహాద్రి వికాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిశె మాధవరావు, వెన్నా ప్రసాద్, లంకే రవి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.
- మచిలీపట్నంటౌన్: అంబేడ్కర్ ఆలోచనా విధానమే భారత దేశాభివృద్ధికి సోపానంలా ఉంటుందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని రెండు అంబేడ్కర్ విగ్రహాలకు విక్టర్ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేస్తే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్పొరేటర్ తిరుమలశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ 19, 21వ డివిజన్ల ఇన్‌చార్జీలు బూరగ రామారావు, మన్నే శేషారావు, రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బట్టు శ్యాంప్రసాద్, రవికుమార్, శ్రీరాం, కోన నాని, నరేష్ తదితరులు పాల్గొన్నారు.
- అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నలుకుర్తి పృథ్వీరాజ్, సైకం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.
- చల్లపల్లి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది పనితీరు అభినందనీయం

మచిలీపట్నంటౌన్: మిచాంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లైన్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి ప్రజలకు సకాలంలో విద్యుత్ సరఫరా చేయడంలో ఆ శాఖ సిబ్బంది చేసిన సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. విద్యుత్‌శాఖ అధికారులను, సిబ్బందిని బుధవారం ఆయన అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాను ప్రభావంతో రెండు రోజుల పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలాయని, లైన్లు తెగిపడ్డాయని, విద్యుత్ సిబ్బంది వర్షంలో తడుస్తూ మరమ్మతులు చేశారని చెప్పారు. మంగళవారం రాత్రి విద్యుత్ శాఖ ఈఈ ఎం. భాస్కరరావుతో పాటు ఏడీఈ, ఏఈలు కార్యాలయాల్లోనే ఉండి ప్రతి ఫోన్‌కు స్పందిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం అభినందనీయమన్నారు.

విపత్తుల సమయంలో బాధితులకు భరోసా



అవనిగడ్డ పునరావాస కేంద్రంలో బాధితులకు నగదు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: తుపాను సమయంలో ఎలాంటి ప్రాణ, పశునష్టం కలుగకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు అండగా ఉండి భరోసా కల్పించాలరని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పునరావాస కేంద్రంలో బాధితులకు ప్రభుత్వ ఆర్థిక సహాయం, దుస్తులు, సరుకులను ఎమ్మెల్యే సింహాద్రి, వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్ అందజేశారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ మండలంలో మొత్తం మూడు పునరావాస కేంద్రాల్లో 82 మంది బాధితులకు పునరావాసం కల్పించామని, వీరికి ప్రభుత్వం నుంచి రూ.78,500 పరిహారం అందించామని తెలిపారు. తహసీల్దార్ రామకృష్ణ, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, సర్పంచ్ దాసరి విజయకుమార్ పాల్గొన్నారు.

సమిష్టిగా తుపాను సహాయక చర్యలు..

లక్ష్మీపురం(చల్లపల్లి): తుపాను తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం సమిష్టిగా పనిచేయటంతో ఒక్క ప్రాణ నష్టం కూడా జరగలేదని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. బుధవారం లక్ష్మీపురం పునరావాస కేంద్రంలో తుపాను బాధితులకు రాష్ట్ర ప్రభుత్వ సహాయాన్ని ఎమ్మెల్యే రమేష్‌బాబు అందజేశారు. చల్లపల్లి మండలంలో లక్ష్మీపురం, చల్లపల్లి, మాజేరు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 28 కుటుంబాలకు చెందిన 77 మందికి పునరావాసం కల్పించారు. బాధితులకు రూ.55 వేల ప్రభుత్వ ఆర్థిక సహాయం, ఉల్లిపాయలు, బంగాళ దుంపలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు, నియోజకవర్గ యువనేత సింహాద్రి వికాస్ బాబు, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

61వేల హెక్టార్లలో వరి పంట నష్టం

గూడూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కృష్ణాజిల్లాలో 61వేల హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లిందని ప్రత్యేక అధికారి లక్ష్మీశా అన్నారు. బుధవారం గూడూరు మండలం చిట్టిగూడూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి పర్యటించిన లక్ష్మీశా స్థానిక ఆర్బీకేలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. లక్ష్మీశా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో పంట నష్టం అంచనాలు రూపొందించడంలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామన్నారు. పొలాల్లో నీరు బయటకు పోయేలా రైతులు తమ వంతు కృషిచేయాలని, తడిచిన ధాన్యం మొలక రాకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 61వేల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు వెల్లడించారు. పంట నష్టం సంభవించిన ప్రతి రైతుకు ప్రభుత్వ పరంగా పరిహారం, పంట బీమా వర్తిస్తుందన్నారు.

48 గంటల్లో నివేదిక

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో పంట నష్టాన్ని 48 గంటల్లో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. తడిచిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం త్వరలో మార్గదర్శకాలు ఇవ్వనుందని, ఆ ప్రకారం ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.